

తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.86	1,589.06
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	140	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,818	0
నీటి నిల్వ (టీఎంసీలు)	79.33	10.26



మాట్లాడుతున్న జడ్పీ ప్లానింగ్ అధికారి డాక్టర్ రోణి

మహిళలు సర్వతోముఖాభివృద్ధి సాధించాలి

● జడ్పీ ప్లానింగ్ అధికారి డాక్టర్ రోణి

రాయచూరు జనవరి 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటు మహిళలు సర్వతోముఖాభివృద్ధి సాధించేలా గ్రామ సంజీవిని ఐక్య సంఘాల అధ్యక్షుల కృషి చేయాలని జడ్పీ ప్లానింగ్ అధికారి డాక్టర్ రోణి సూచించారు. సంజీవిని పథకవ బాధ్యులు, గ్రామ ఐక్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల కోసం నగర సమీపం యరమరస్ వద్ద సంజీవిని రిసోర్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ ప్లానింగ్ అధికారి డాక్టర్ రోణి, సంజీవిని పథకం ద్వార అమలు చేస్తున్న పథకాల గురించి అధ్యక్ష, కార్యదర్శులకు వివరించారు. వాటిని శిక్షణ ద్వార తాము అవగాహన చేసుకున్న విషయాలను స్వయం సహాయక సంఘాల మహిళలను వివరించడం ద్వార వారి ఆర్థిక పురోగతిలో భాగస్వాములు కావాలని సూచించారు. పథకం ఉద్దేశాలను నెరవేర్చడం ద్వారా ఐక్య సంఘాల ప్రతినిధులు గ్రామీణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

పూలే సిద్ధాంతాలను పాటించాలి



నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సిరుగుప్ప, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యాప్రగతికి సావిత్రీబాయి పూలే ఎంతో కృషి చేశారని 6వ వార్డు ఉర్దూ ప్రభుత్వ పాఠశాల ముఖ్యోపాధ్యాయిని షహీనా పేర్కొన్నారు. సిరుగుప్ప పట్టణం ఉర్దూ పాఠశాలలో సావిత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సమాజ సేవకుడు అబ్దుల్ నబీ, మహ్మద్ నవ్‌సిద్దా అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంఘాలను సద్వినియోగం చేసుకోవాలి

రాయచూరు జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధన మేరకు కొనసాగుతున్న సహకార సంఘాలు మరింత బలోపేతం కావడమేగాక వాటిని సద్వినియోగం చేసుకునేందుకు సభ్యులు సహకరించాలని నగరానికి చెందిన యువశక్తి కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ ఇలియాస్ పాషా కోరారు. సహకార చట్టం రజతోత్సవంలో భాగంగా సహకార సంఘాల దినాచరణను రాయచూరు నగరంలోని కోఠారి ఫంక్షన్ హాల్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ జెండాను ఎగరవేసిన యువశక్తి సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ ఇలియాస్ పాషా సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బసనగౌడ పాటిల్ యత్నాళ్

వక్ఫ్ పేరుతో రైతుల భూములను లాక్కొంటున్న ప్రభుత్వం

● మాజీ మంత్రి బసనగౌడ పాటిల్ యత్నాల్ ఆగ్రహం

కంప్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వక్ఫ్ పేరుతో రైతుల భూములను లాక్కొంటుందని మాజీ మంత్రి బసనగౌడ పాటిల్ యత్నాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బళ్లారి జిల్లా కంప్లి లో 'వక్ఫ్ హఠావ్' నినాదంతో బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. కంప్లి ఉద్భవ గణపతి ఏరియా నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కుమార బంగారప్ప, మాజీ మంత్రి రమేష్ జార్కిహోళి, అరవింద్ లింబావలి, అభినవ ప్రభుస్వామి, సిద్దేశ్వర, బీవీనాయక్, ఎం భరత్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ పేరుతో ప్రభుత్వం రైతులను ఆందోళనకు గురి చేస్తోందన్నారు. ఇలాంటి ప్రభుతానికి రైతులు, ప్రజలు బుద్ధిచెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. కంప్లిలోనే వక్ఫ్ పేరుతో 300 ఎకరాల వరకూ భూములు లాకున్నారని, రైతుల కడుపు కొట్టడానికి కాంగ్రెస్ చేతులు ఎలా వచ్చాయో తెలియదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములు, రైతులు భూములు, అటవీభూములు ఇలా అన్ని భూములను వక్ఫ్ పేరుతో స్వాధీనం చేసుకుంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉందని ఆరోపించారు. నిరసనకు బీజేపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.



ర్యాలీగా వెళ్తున్న బీజేపీ నాయకులు

కళాకారుల సంఘానికి రూ.5 లక్షల విరాళం

● భవన నిర్మాణానికి సహకరిస్తాం: ఎంపీ తుకారాం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ తుకారం, మేయర్ నందీష్ కుమార్

బళ్లారి సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎంపీల నిధుల నుంచి కళాకారుల సంఘం కార్యాలయాన్ని ప్రారంభించేందుకు రూ.5 లక్షల సాయం అందిస్తామని ఎంపీ తుకారం హామీ ఇచ్చారు. నగరంలోని దొడ్డనగౌడ రంగమందిరంలో శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు జరుగు కళావైభవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విజయనగర కాలం నుంచి కళా ప్రదర్శలో బళ్లారి జిల్లా ప్రముఖ పాత్ర పోసిస్తుందన్నారు. సజీవ కళ నాటకం, కళాకారులకు ఎల్లప్పుడూ జీవనాధారంగా ఉంటుంది. ఎందుకంటే నాటకాలు వారికి విలువతతో కూడిన జీవితాన్ని నేర్పిస్తాయన్నారు. ఇవి సమాజాన్ని సరైన దారిలోకి తీసుకురావడంలో పాత్ర పోషించాయి. ప్రస్తుత రోజుల్లో మొబైల్ పోన్లు అందరినీ తల దించుకునేలా చేశాయన్నారు. మోతీ రైల్వే బ్రిడ్జ్ 5,6నెలల్లో వెడల్పు చేయనున్నట్లుతెలిపారు. మేయర్ ముల్లంగి నందీశ్ మాట్లాడుతూ జిల్లాలో కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సహాయ సంచాలకులు నాగరాజ్ మాట్లాడుతూ శాఖలోని కళాకారులు ఎన్నో ప్రాజెక్టులు కలిగి ఉన్నారని, వాటిని సద్వినియోగం చేసుకొని దేశ విదేశాల్లో ప్రదర్శనలు నిర్వహించి ఖ్యాతి గడించాలన్నారు. ఈదేశ సంస్కృతిని అర్థం చేసుకున్నప్పుడే ప్రజల కోసం పని చేయడం సాధ్యమని సిరిగేరి పన్నరాజ్ అన్నారు. చిత్రకళా ప్రదర్శనల్లో పిల్లలను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బుడా అధ్యక్షులు ఆంజనేయులు, సిద్రామన్‌గౌడ, మహ్మద్ రఫిక్, మీనల్లిచంద్రశేఖర్, పాండురంగప్ప, రమేశ్ గౌడ పాటిల్, సిద్దమ్మనహళ్ళి తిమ్మనగౌడ,ఆదోని వీణా పాల్గొన్నారు. రెండు రోజులపాటు నృత్యం, గానం, నాటకం, ఇంద్రజాలం,బయలాట, కవి కావ్య, శాస్త్రీయ. జానపదసంగీతం, బృంద నృత్యం,వాయిద్య కచేరి,సహా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జయంతిని అర్థవంతంగా నిర్వహించాలి

● అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్

బళ్లారి సిటీ, జనవరి 4((ఆంధ్రజ్యోతి): మహనీయుల జయంతిని అర్థవంతంగా నిర్వహించాలని, ప్రజలకు వారిపై పూర్తిగా అవగాహన కల్పించాలని అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్ అధికారులకు సూచించారు. శనివారం నగరంలోని అనంతపురం రోడ్డులోని నూతన జిల్లాపాలనా భవనంలోని హాల్లో వివిధ ప్రముఖుల జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ముందస్తు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జనవరి 15న శివయోగి జయంతి, 19న మహాయోగి వేమన జయంతి. 21న నిజశరణం అంబిగర చౌడయ్య జయంతిని నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన సన్నాహాలు చేయాలని ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. ఊరేగింపు అనంతరం వేదిక కార్యక్రమం ఉంటుందన్నారు. ఆహ్వాన పత్రాలను ముద్రించి ప్రముఖులను ఆహ్వానించాలన్నారు. జయంతి కార్యక్రమంలో తాగునీరు, తేలికపాటి అల్పాహారం ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈసందర్భంగా జిల్లాస్థాయి వివిధ శాఖల అధికారులు, కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు నాగరాజు, ప్రజాసంఘాల నాయకులు, వివిధ సంఘాల పదాధికారులు పాల్గొన్నారు.

తేనెటీగలతో ఉద్యానపంటల్లో అధిక ఉత్పత్తి

● ఎపికల్చర్ ప్రొఫెసర్ మోహన్‌నాయక్

బళ్లారి సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉద్యానవన పంటలు అధికంగా ఉత్పత్తి కావడానికి తేనెటీగలు ప్రధాన కారణమని బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎపికల్చర్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ మోహన్‌నాయక్ తెలిపారు. శనివారం సండూర్ పట్టణంలోని కర్ణాటక స్టేట్ మినరల్స్ కార్పొరేషన్ లిమిటెడ్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తేనెసాగు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కిరణజన్య సంయోగక్రియ తేనెటీగలు రైతుల దిగుబడిని పెంచడంలో సహాయపడుతాయని, ఇటీవలి కాలంలో వ్యవసాయంలో విపరీతంగా ప్రమాదకర రసాయనాలు వాడడం వల్ల తేనెటీగల సంతతి తగ్గిపోతుందన్నారు. తేనెతో ఎన్నో రోగాలు నయమవుతాయన్నారు. 95 శాతం తెనెను ఆయుర్వేదం ఔషదాలలో వాడతారన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌కుమార్ తేనెటీగల పెంపకం పద్ధతులు, ప్రాముఖ్యతను వివరించారు. కర్ణాటక స్టేట్ మినరల్స్ కార్పొరేషన్ డీజీఎం గవాణ్ బసవరాజప్ప మాట్లాడుతూ..... ఆసక్తి ఉన్న వారికి మొదటి దశలో తమ కంపెనీ నుంచి 50 తెనే పెంపకం బాక్సులను ఉచితంగా ఇస్తున్నామన్నారు.



తేనెటీగ బాక్సులను పంపిణీ చేస్తున్న ప్రొఫెసర్ మోహన్‌నాయక్



నిరసనలో బీజేపీ ప్రముఖులు , కార్యకర్తలు

కాంట్రాక్టర్ హత్యకు ఖర్గేదే బాధ్యత..

బళ్లారి సిటీ,జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ సచిన్ మృతికి బాధ్యత వహిస్తూ మంత్రి ప్రియాంక ఖర్గే నాజీనామా చేయాలని, ఘటనను సీబీఐతో విచారణ జరిపించాలని, బస్సు చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించి జిల్లా అధికార యంత్రాంగానికి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా బీజేపీ సీనియర్ నేత రామలింగప్ప మాట్లాడుతూ సచిన్ కటుంబానికి తక్షణమే రక్షణ కల్పించి భద్రత కల్పించాలన్నారు. అతని కుటుంబానికి కోటి రుపాయల పరిహారం అందించాలని, మృతుడి సోదరీమణులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యలు పెరిగిపోయాయన్నారు. ప్రభుత్వం మంత్రులు, అధికార పార్టీ శాసనసభ్యులు కాంట్రాక్టర్లను వేధించడంతోనే ఆత్మహత్యలు పెరిగాయన్నారు. పలు చోట్ల కమీషన్ల పర్వం జోరందకుందన్నారు. గతంలో అదే ప్రభుత్వంలోని మంత్రి నాగేంద్రకూడా వాల్మీకి కార్పోరేషన్ కుంభకోణలో చిక్కుకుని రాజీనామ చేశారు. ప్రియాంక ఖర్గే రాజీనామాను ఆలస్యం చేయకుండా ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆమోదించాలన్నారు. నిరసనలో పార్టీ నాయకులు రామలింగప్ప, డా.మహిపాల్, హెచ్.హనుమంతప్ప, ఆరుణాచలం, గణపాల్ ఐనాథ్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

బస్సు చార్జీల పెంపు నిర్ణయంపై ఎస్‌యూసీఐ నిరసన



తాలూకా ఆఫీసు వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌యూసీఐ సభ్యులు

బళ్లారి సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బస్సు చార్జీలను పెంచాలన్న నిర్ణయం తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ బళ్లారి జిల్లా కమిటీ పాత తాలూకాపీసు సర్కిల్ వద్ద ఎస్‌యూసీఐ శనివారం ఆందోళన నిర్వహించారు. నిరసనను ఉద్దేశించి కామ్రెడ్ సోమశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని రోడ్డు రవాణా సంస్థల బస్సు చార్జీలను 15శాతం పెంచడాన్ని ఎస్‌యూసీఐ కమ్యూనిస్ట్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఇప్పటికే నిత్యావసరాల అధిక ధరలతో సామాన్యులకు భారం తప్పడం లేదన్నారు. బస్సు చార్జీల పెంపుతో మరిన్ని కష్టాలు తప్పవన్నారు. జిల్లాధ్యక్షుడు డాక్టర్ ప్రమోద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బకాయిలను రవాణా సంస్థలకు జాప్యం లేకుండా చెల్లించాలన్నారు. రాష్ట్రరోడ్డు రవాణా సంస్థల్లో అవినీతి, దుబారాను అరికట్టాలని, రాష్ట్రానికి చెల్లించాల్సిన పన్నును కేంద్ర ప్రభుత్వం చెల్లించాలన్నారు. నిరసనలో పార్టీ సభ్యులు హనుమప్ప, గోవింద్,సౌమ్యరాజా, ఈశ్వరీ,అభిలాష్, మంజు,ఈరన్న, శాంతి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్వల్‌కు మరిన్ని కష్టాలు..!

● దర్యాప్తు వేగవంతం ● ట్రయల్‌కు సిద్ధమవుతున్న సిట్

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): లైంగిక దౌర్జన్యాల ఆరోపణలు ఎదుర్కొంటూ జైలుపాలైన జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు మరింత సంక్లిష్ట పరిస్థితి తప్పేలా లేదు. ప్రస్తుతం పరప్పన అగ్రహార జైలులో ఉన్న ప్రజ్వల్ కేసు విచారణ జరిపిన స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీం(సిట్) ట్రయల్ జరిపేందుకు సిద్ధమైనట్లు సమాచారం. గత ఏడాది మే నెలలో జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ రోజున ప్రజ్వల్ విదేశాలకు పరారీ కాగా నెల రోజుల తర్వాత బెంగళూరుకు వచ్చిన వెంటనే అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆరునెలలుగా ప్రజ్వల్ జైలులోనే గడుపుతున్నారు. స్థానిక కోర్టుల్లో బెయిల్ సాధ్యం కాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఆయనకు అక్కడా చుక్కెదురయ్యింది. చివరకు సుప్రీం కోర్టులో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ కూడా తిరస్కరణకు గురికావడంతో ట్రయల్ జరపాలని సిట్ తీర్మానించింది. ట్రయల్ ప్రారంభమైతే కొన్ని రోజులలోనే కేసు తుదిదశకు చేరి తీర్పు వచ్చే అవకాశాలు ఉంటాయి. లోక్‌సభ ఎన్నికల వేళ ప్రజ్వల్ అత్యాచార పెన్‌డ్రైవ్‌లు సంచలనం రేపిన సంగతి తెలిసిందే. పనిమనిషిపై అత్యాచారం చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆతర్వాత రేవణ్ణతో పాటు భార్య భవానీ రేవణ్ణలపై కిడ్నాప్ కేసులు నమోదు కాగా రేవణ్ణ జైలుకెళ్ళి బెయిల్‌పై బయటకు వచ్చారు. భవానీ రేవణ్ణ ముందస్తు బెయిల్‌పై బయటపడ్డారు. సంక్రాంతి పండుగ తర్వాత సిట్ ట్రయల్‌కు సిద్ధం కావచ్చునని తెలుస్తోంది. దీంతో జేడీఎస్ వర్గాల్లో ఆందోళన మొదలయ్యిందని చెప్పవచ్చు.

హోసూరు జోన్



యువకులను సన్మానిస్తున్న మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

యువకులకు మాజీ మంత్రి సన్మానం

హోసూరు జనవరి 4(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్‌లో గుంతలమయమైన రహదారిని, ఇసుకతో నింపి ప్రమాదాలను తప్పించిన యువకులను మాజీ మంత్రి పి.బాలకఅష్ణారెడ్డి శనివారం అభినందించారు. హోసూరు బాగలూరు రోడ్డు టీచర్స్ కాలనీ, ఎన్‌జీజీఓఎస్ కాలనీ, తదితర ప్రాంతాల రోడ్లల్లో వెళ్లే వాహనదారులు గుంతల రోడ్ల కారణంగా వాహనదారులు ప్రమాదానికి గురయ్యేవారు. యువకులే గుంతలను పూడ్చారు. వారి కృషిని బాలకృష్ణారెడ్డి అభినందించి శాలువా కప్పి సత్కరించారు.



లబ్ధదారులకు టోకెన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య

సంక్రాంతి కానుకల టోకెన్ల పంపిణీ

హోసూరు జనవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సంక్రాంతి టోకెన్లు పంపిణీ ప్రారంభించారు. ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మేయర్ సత్య శనివారం ప్రజలకు సంక్రాంతి కానుకలకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం మేరకు అందరికీ సంక్రాంతి కానుకలు అందజేస్తామన్నారు. టోకెన్లు అందుకున్న కుటుంబ కార్డుదారులు ఆయా సమయానికి వెళ్లి సరుకులు తీసుకోవాలన్నారు. జనవరి 9 వ తేది నుంచి కానుకలు అందజేస్తారన్నారు. కానుకల్లో కిలో బియ్యం, కిలో చక్కెర, చెరుకు గడ అందిస్తారన్నారు. టోకెన్ల పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆనందయ్య , 22 వ వార్డు కౌన్సిలర్ చైర్మెన్ పబ్లిక్ హెల్త్ కమిటీ మాదేశ్వరన్, ముఖ్య కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు ఎల్లోర మణి, డివిజన్ సెక్రటరీ వెంకటేశ్, జనరల్ కమిటీ మెంబర్ దనలక్ష్మి , ఇంజనీర్ టీమ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెత్రి జ్ఞానశేఖరన్, ద్రావిడ కళగం వనవేందన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే మాంసం వ్యర్థాలు

● దుర్వాసనతో వాహనదారులకు ఇబ్బందులు

హోసూరు జనవరి 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కనే మాంసం వ్యర్థాలు పారేస్తుండంతో దుర్వాసనతోపాటు వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. హోసూరు పట్టణ సరిహద్దులో పలు మాంసం దుకాణదారాలు చికెన్, మటన్ వ్యర్థాలను పారేస్తున్నారు. అటవీ ప్రాంతం కావడంతో వ్యర్థాలను తినడానికి వన్యప్రాణులు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా కొందరు మారడం లేదు. తరచూ అక్కడే వ్యర్థాలను పారేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



పట్టణ సరిహద్దులో పడేసిన మాంసం వ్యర్థాలు

గుండె సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వండి

● సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అయ్యంగార్

బళ్లారి సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మనిషి అవయవాల్లో గుండె పాత్ర అత్యంత కీలకమైనదని, దాని సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సీనియర్ కార్డియాలజిస్ట్, రిటైర్డ్ వింగ్ కమాండర్ డాక్టర్ అయ్యంగార్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యాక్రమాల్లో ఒకటైన డా. పునీత్ రాజ్‌కుమార్ హృదయ్ జ్యోతి పథకంలో బాగంగా, ఆరోగ్య కుటుంబ సంక్షేమ సేవల డైరెక్టర్, ట్రీకాగ్ నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గుండె జబ్బులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు సిరుగుప్ప, హగరిబొమ్మనహళ్లి, కూడ్లిగి, హొసపేట, కుష్టగి, యలబుర్గా ప్రభుత్వ ఆసుపత్రుల నిపుణులు, వైద్యులు జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారుల హాల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుండె సంబంధిత సమస్యలు ఏవైనా ఉంటే నిర్లక్ష్యం చేయకుండా చికత్స పొందాలన్నారు. గుండె ఆరోగ్యంగా ఉండేందుకు, దీర్ఘాయుష్షు పొందేందుకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుండె సంబంధిత వ్యాధుల లక్షణాలు నిద్రకు భంగం , తీవ్రమైన శ్వాస ఆడకపోవడం. చేయి మిలికలు తిరగడం ,కారణం లేకుండా చెమటలు పట్టడం, వికారం, వాంతులు మొదలైన లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. జిల్లా సర్వేయర్ డా.మరియంబి మాట్లాడుతూ సరైన జాగ్రత్తలు తీసుకుంటే గుండెపోటు వచ్చినా కాపాడుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఆరోగ్య హృదయజ్యోతి ప్రాజెక్టు మేనేజర్ గౌతమ్ సత్యప్రేమ్‌తో పాటు ముగ్గురు జిల్లాల స్పెషలిస్టు వైద్యులు, సిబ్బంది శృతి,హనుమంతు, ప్రదీప్, రవికుమార్, విజయమాలి తదితరులు పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ అయ్యంగార్

అంబులెన్స్‌ను ఢీకొన్న ట్రాక్టర్

● అంబులెన్స్ సిబ్బందికి తీవ్రగాయాలు

రాయచూరు జనవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవదుర్గ తాలూకా సముదాయ ఆరోగ్య కేంద్రానికి చెందిన అంబులెన్స్‌ను రాళ్ల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఒకటి ఢీకొట్టింది. ఈ సంఘటన సిరవార-అరకేరా మార్గమధ్యంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. అత్యవసర వైద్యసేవల కోసం రోగి ఒకరిని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించి తిరిగి అరకెరాకు వస్తున్న అంబులెన్స్‌ను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో అంబులెన్స్ డ్రైవర్ విజయ్‌కుమార్‌తోపాటు అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ హనుమంతు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఇద్దరిని చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు వైద్యాదికారులు తెలిపారు.




దెబ్బతిన్న అంబులెన్స్

నీటి శుద్ధి ప్లాంట్‌ను పరిశీలించిన అధికారి

● వదంతులు నమ్మవద్దని ప్రజలకు హితవు

రాయచూరు జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని ఆల్కార్ నీటి శుద్ధీకరణ ప్లాంట్‌ను తాలూకా పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి శనివారం పరిశీలించారు. రెండు రోజుల క్రితం వీధి కుక్క ఒకటి తాగునీటి ప్లాంట్‌లో చనిపోయి పడి ప్రజలు వాంతులు, విరేచనాలకు గురవుతున్నారంటు వదంతులు వ్యాపించిన నేపద్యంలో అధికారి క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. గత 20 రోజులుగా ఆల్కారు బిచ్చాలి వాటర్ ప్లాంట్‌ల గుండా నీటి సరఫరా నిలిపివేసినట్లు అధికారి తెలిపారు. రైల్వే ట్రక్ సమీపంలో పైపుల మరమ్మత్తు కారణంగా శుద్ధీకరణ ప్లాంట్‌లో నీటి సరఫరా నిలిచిపోయిందని ఆగివున్న నీటిలో దుండగులు ఉద్దేశపూర్వకంగా చనిపోయిన కుక్కను వేసి ప్రజల్లో వదంతులు సృష్టించారని వాటిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు.



ట్యాంకులో వీధికుక్క కళేబరం



అనుగ్రహభాషణం చేస్తున్న మంత్రాలయ పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామి



నమో వాయుపుత్రా..!

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

హనుమద్ నామస్మరణతో మార్మోగిన అనంత

హాజరైన హంపి, మంత్రాలయ పీఠాధిపతులు


హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న సంధ్యామూర్తి బృందం


హనుమాన్ చాలీసా పారాయణలో పాల్గొన్న విద్యార్థులు


జై హనుమాన్..





అనంతపురం కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఏక కాలంలో 20వేల గొంతుకలు హనుమద్ నామస్మరణ చేయడంతో అనంత నగరం భక్తిభావంతో పులకించింది. హనుమాన్ చాలీసా పారాయణ ప్రచార సమితి ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో సామూహిక హనుమాన్ చాలీసా నిర్వహించారు. దాదాపు 150 ఆలయాల ప్రతినిధులు, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆధ్యాత్మికవేత్తలు, జిల్లాలోని దాదాపు 60 పాఠశాలల విద్యార్థులు దాదాపు 20వేల మందితో ఆర్ట్స్ కళాశాల మైదానం కిక్కిరిసిపోయింది. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీ మహాస్వామి జ్యోతిప్రజ్వలన చేశారు. రాజమహేంద్రవరం కమాండెంట్ ఎస్పీ డాక్టర్ కొండా నరసింహారావు దంపతులు దాదాపు రెండున్నర నిమిషాల పాటు నిర్విరామంగా శంఖారావం పూరించి హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత నృత్యకళాకారులు హనుమాన్ చాలీసా సంగీతానికి శాస్త్రీయ నృత్యం చేస్తూ అలరించారు. అనంతరం సంగీత విద్వాంసురాలు సంధ్యామూర్తి బృందం హనుమాన్ చాలీసా పఠించగా వీరితోపాటు విద్యార్థులంతా సామూహికంగా చాలీసా పారాయణం చేశారు. తదనంతరం మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠాధిపతి సుబుదేంద్రతీర్థ స్వామి హాజరై అనుగ్రహభాషణం చేశారు. భక్తితత్వం, విశ్వాసం అంటే ఏమిటో హనుమంతుడు లోకానికి చాటిచెప్పారన్నారు. ఆయన చూపిన భక్తిభావాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. మరో పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి అనుగ్రహభాషణం చేస్తూ హనుమాన్ చాలీసా పారాయణం మానసిక ప్రశాంతతోపాటు మనోధైర్యాన్ని ఇస్తుందన్నారు. భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ గంగాధరశాస్త్రి మాట్లాడుతూ హనుమంతుడి జీవితగాధను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మనలో ధైర్యం, ఆత్మవిశ్వాసం నింపే ప్రతిఒక్కరూ హనుమంతులేనని ఉపదేశించారు. అనంతరం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మొమెంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ శ్యామ్‌కుమార్, ప్రమోద్‌కుమార్, సుంకు వేణుగోపాల్, ఆకుల రాఘవేంద్ర, ఎమ్రాల్డ్ రమణ, టీచర్ ప్రసాద్, సత్యనారాయణ, కామర్స్ రఘు, మురళి, రవి, హర్షద్ జైన్, రామకృష్ణ, పవన్, న్యాయవాది గురుప్రసాద్, శ్రీపాద వేణు తదితరులు పాల్గొన్నారు.

అంధులకు ఆదర్శం బ్రెయిలీ జీవితం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): లూయిా బ్రెయిలీ జీవితం, లిపి అంధులకు ఆదర్శంగా, మార్గదర్శకంగా నిలిచాయని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. లూయిస్‌బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని జాతీయ అంధుల క్రీడా సమాఖ్య ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా స్థానిక కృష్ణకళామందిరంలో నిర్వహిస్తున్న అంధుల క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అంధులను ప్రోత్సహించి, అందరితో సమానంగా చూడాలని కోరారు. లూయిాస్‌బ్రెయిలీ స్ఫూర్తితో అంధులు వివిధ రంగాల్లో రాణిస్తుండటం అభినందనయమన్నారు. అంధుల ప్రతిభకు పదునుపెట్టే విధంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ డీడీ ఖుష్బూకొఠారి, అంధుల క్రీడాసమాఖ్య సభ్యులు విజయభాస్కర్, రవి, నాగశివారెడ్డి, నాగార్జున, ఎర్రిస్వామి, కుమార్ రాజా, అంధ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


అంధులకు సెర్చ్ స్టిక్స్ అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అంధుల క్రికెట్ పోటీల విజేత తిరుపతి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అంధుల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో తిరుపతి జట్టు విజేతగా నిలిచింది. లూయిాస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని అంధ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్ పోటీల్లో విశాఖపట్నంపై తిరుపతి జట్టు గెలిచి టోర్నీ విజేతగా నిలిచింది. స్థానిక రామ్‌నగర్‌లోని యాదవ కల్యాణమండపంలో శనివారం లూయిా బ్రెయిలీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ లూయిాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ అజయ్‌రెడ్డి, మీనాక్షమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటరమణ, లేడీస్‌క్లబ్ సభ్యురాలు శ్రీదేవి, వైద్యులు భవాని, పీఓసీ రమణ, అంధుల ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి జలంధర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ, కార్యదర్శి సాజియతీ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అండర్-17 జాతీయస్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. దేశవ్యాప్తంగా 12 జట్లు, 216మంది క్రీడాకారిణులు భాగస్వాములైన 4వ ఇన్‌స్పైర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను అనంత క్రీడా గ్రామంలో నిర్వహిస్తున్నారు. 8రోజుల పాటు సాగే టోర్నీని ఆర్డీటీ, లాలిగా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో కంపాసిజన్-గోవా, పెన్నా-ఏపీ, నర్మదావ్యాలీ-మధ్యప్రదేశ్, థామ్-తమిళనాడు, లైఫ్‌స్పోర్ట్స్-తమిళనాడు, నందిఫౌండేషన్-గుజరాత్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్-గుజరాత్, అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ (ఆంధ్రప్రదేశ్), స్పోర్ట్స్‌ప్లస్ ఫుట్‌బాల్ అకాడమీ-తమిళనాడు, ఫాల్కన్‌గర్ల్స్-ఒడిశా, లిబర్టీ లేడీస్-తమిళనాడు, బెంగళూరు జట్లు తలపడనున్నాయి. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారిణులలో దాగి ఉన్న క్రీడానైపుణ్యతను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా అవకాశం కల్పించేందుకే ఈ పోటీలు నిర్వహిస్తు న్నామని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు అనంతస్పోర్ట్స్ అకాడమీ-ఆంధ్రా జట్టుపై నర్మదావ్యాలీ 3గోల్స్ తేడాతో, ఒడిశాపై గుజరాత్ 6 గోల్స్, గుజరాత్‌పై బెంగళూరు 17గోల్స్ తమిళనాడుపై పెన్నా-ఏపీ ఒక గోల్, తమిళనాడుపై కంపాసిజన్ 18గోల్స్, లైఫ్ స్పోర్ట్స్ అకాడమీపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్ 10గోల్స్ తేడాతో విజయం సాధించాయి.


ఏఎస్ఏ, నర్మదావ్యాలీ జట్ల మధ్య మ్యాచ్

జాబ్‌మేళా క్యాలెండర్ విడుదల

అనంతపురం రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెలలో నిర్వహించనున్న జాబ్ మేళాలకు సంబంధించిన క్యాలెండర్‌ను కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం విడుదల చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రతినెలా నైపుణ్యాభివృద్ధి సంస్థ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను అందించేందుకు జాబ్‌మేళాలు నిర్వహిస్తుంద న్నారు. ఈనెల 10న రాయదుర్గం నియోజకవర్గంలో కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాల, శింగనమల నియోజకవర్గంలోని నార్పల పాల్‌టెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తారన్నారు. 18న రాప్తాడు నియోజకవర్గం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల, కళ్యాణదుర్గం నియోజకవర్గం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా ఉంటాయన్నారు. వివరాలకు 8317520929, 8554281026 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈకార్యక్రమంలో అడిషనల్ జిల్లానైపుణ్యాభివృద్ధి అధికారి జగన్‌యాదవ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మహేష్ పాల్గొన్నారు.


జాబ్‌మేళా క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్

ఫ్రెండ్‌షిప్ క్రికెట్ సిరీస్ విజేత అనంత

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 4 (ఆంధ్ర జ్యోతి): ఫ్రెండ్‌షిప్ క్రికెట్ సిరీస్ విజేతగా అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్టు నిలిచింది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో శనివారం ఫ్రెండ్‌షిప్ క్రికెట్ సిరీస్ ఫైనల్ పోటీని హట్‌హాక్స్ న్యూజిల్యాండ్, అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్ల మధ్య నిర్వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 161పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన న్యూజిల్యాండ్ హట్‌హాక్స్ జట్టు 20ఓవర్లలో 3వికెట్లు నష్టానికి 139 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం ఫ్రెండ్‌షిప్ సిరీస్‌లో క్రీడాకారులకు ఫీల్డింగ్, బ్యాటింగ్, బౌలింగ్‌లో మెలకువలు నేర్పిన ఇంగ్లాండ్ క్రికెటర్ హసీబ్‌హమీద్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, ఇన్‌చార్జి సెక్రెటరీ భీమలింగారెడ్డి, వెటరన్ క్రికెటర్ నాగప్పా, కిమ్స్ డైరెక్టర్ డాక్టర్ హబీబ్, న్యూజిల్యాండ్ మాజీ క్రికెటర్ బ్రూస్ ఎడ్గర్, న్యూజిల్యాండ్ హట్‌హాక్స్ చైర్మన్ రవి కృష్ణమూర్తి, మాజీ రంజీ క్రీడాకారుడు షాబుద్దీన్, కోచ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


విజేత అనంత, రన్నరప్ న్యూజిల్యాండ్ హట్‌హాక్స్ జట్లు

గడువు పొడిగింపు

అనంతపురం టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడిటేషన్‌ల కాలపరిమితిని మరో రెండు నెలలు పొడిగించినట్లు జిల్లా సమాచారశాఖ డీఐపీఆర్వో గురుస్వామిశెట్టి శనివారం ఓప్రకటనలో తెలిపారు. గత డిసెంబరు 31నాటికి అక్రిడిటేషన్ కలిగి, ప్రస్తుతం పనిచేస్తున్న జర్నలిస్టులకు మాత్రమే ఈఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల వరకు పొడిగింపు సౌకర్యం ఉంటుందన్నారు. సంబంధిత మీడియా యాజమాన్యాలు ప్రస్తుతం పనిచేస్తున్న, తొలగించిన జర్నలిస్టుల వివరాలను తమకు పంపాలన్నారు. యాజమాన్యాల సమాచారంమేరకే అక్రిడిటేషన్ల గడువు పొడిగించాలని రాష్ట్రసమాచారశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయని ఆయన వెల్లడించారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు: డీఎంఓ

అనంతపురం టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా తగిన చర్యలు తీసుకోవాలని సబ్ యూనిట్ ఆఫీసర్లకు జిల్లా మలేరియా నివారణాధికారి (డీఎంఓ) డాక్టరు ఓబులు ఆదేశించారు. జిల్లాకార్యాలయంలో శనివారం ఆయన సీజనల్ వ్యాధుల నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంఓ మాట్లాడుతూ సబ్‌యూనిట్ ఆఫీసర్లు నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అవసరమైన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, ఆరోగ్యసిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేపట్టాలన్నారు. కొందరు సబ్‌యూనిట్ ఆఫీసర్లు సరిగా విధులకు వెళ్లడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అసిస్టెంట్ డీఎంఓ సత్యనారాయణతోపాటు సబ్‌యూనిట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఫార్మసిస్టు పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కడపజోన్-4 పరిధిలో కాంట్రాక్ట్ పద్ధతిలో 15 ఫార్మసిస్టుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి శనివారం ఓప్రకటనలో వెల్లడించారు. ఈనెల 17 వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉందన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈనెల 5 ఆదివారం, 12నుంచి 15వరకు సంక్రాంతి సెలవులు నేపథ్యంలో ఆరోజుల్లో దరఖాస్తులు స్వీకరించమన్నారు. పోస్టులకు సంబంధించిన దరఖాస్తు నమూనా, ఇతర వివరాలు జ్ఞిఛిజరీ.్ఞ జౌఠి.జీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ప్రాంతీయ సంచాలకులు, వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, కడపకు పంపాలన్నారు.

నేడు ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం

అనంతపురం విద్య, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) 78వ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, కోశాధికారి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి రాష్ట్ర ప్రధానకార్యదర్శి రఘునాథరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర నాయకులు హాజరవుతారన్నారు. జిల్లావ్యాప్తంగా ఉండే ఎస్టీయూ రాష్ట్ర, జిల్లా, మండల, నగర పాలక, పురపాలక కార్యవర్గసభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

కర్షకుల కష్టాలు..!

పొలాల్లో వరుస చోరీలు

- ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం
- రాగివైరు ఎత్తుకెళ్తున్న దొంగలు
- ఇబ్బంది పడుతున్న రైతులు

కళ్యాణదుర్గం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వరుస చోరీలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల పొలాల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైరు చోరీ చేసే సంఘటనలు పెరిగిపోయాయి. దీంతో సాగునీరందక పంట పొలాలు ఎండిపోతున్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పంటకు అడవి జంతువుల నుంచి కాపలా కాసే పరిస్థితుల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లకు కూడా కాపలా ఉండాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

ఎడాపెడా చోరీలు..

గత ఏడాది ఏప్రిల్ 30న కళ్యాణదుర్గం మండలంలోని కామక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో సబ్ మెర్సిబుల్ మోటారును దుండగులు ఎత్తుకెళ్లారు. ఇదే నెలలో బోరంపల్లి సమీపంలోని ఓ వ్యవసాయ తోటలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులకొట్టి రాగి వైరును చోరీ చేశారు. యర్రంపల్లికి చెందిన ఓ రైతు పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, రాగి వైరును ఎత్తుకెళ్లారు. దురదకుంట, భట్టువానిపల్లి గ్రామాల్లో కూడా రెండు చోట్ల దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను పగులకొట్టి రాగి వైరు ఎత్తుకెళ్లారు. కంబదూరు మండలంలోని కుర్లపల్లిలో 24 గంటలు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు పగుల కొట్టి, రాగి వైరును ఎత్తుకెళ్లారు. గ్రామ సమీపంలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైరును ఎత్తుకెళ్లారు. ఓబయ్యతోట సమీపంలో కూడా ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైర్‌ను అపహరించారు. తాజాగా జనవరి 1న అర్ధరాత్రి సమయంలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి లే అవుట్‌లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి రాగి వైరును చోరీ చేశారు. అలాగే మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు.


కళ్యాణదుర్గం మండలం భట్టువానిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి వైరును ఎత్తుకెళ్లిన దృశ్యం (ఫైల్)


తన పొలంలో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగివైరును ఎత్తుకెళ్లినట్లు చూపిస్తున్న రైతు పవన్ (ఫైల్)

రాగి వైరుకు డిమాండ్ ఉండటం వల్లే..

గతంలో డ్రిప్పులు, స్ప్రింక్లర్లను మాత్రమే దొంగలు ఎత్తుకెళ్లేవారు. అయితే రాగికి మార్కెట్‌లో మంచి డిమాండ్, విలువ ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసంపై దృష్టి సారించారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రాగి విలువ రూ. 900లు నుంచి రూ. 1000లు పలుకుతోంది. సాధారణంగా ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌లో 30 కిలోల నుంచి 40 కిలోల రాగి వైరు ఉంటుంది. ఒక కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను తయారు చేయడానికి దాని సామర్థ్యాన్ని బట్టి రూ. 30 వేలు నుంచి రూ. 45 వేల వరకు ఖర్చు అవుతుంది. కానీ దొంగలు మాత్రం ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రాగి వైరును ఎత్తుకెళ్లి రూ. 12 వేలు నుంచి రూ. 15 వేలకే విక్రయిస్తున్నారు. తక్కువ ధరకు రాగి వైరు లభిస్తుండటంతో కొనేవారు కూడా ఆసక్తి చూపుతున్నారు.

కాపలా వెళ్తున్నాం



దొంగల తాకిడి ఎక్కువ కావడంతో రాత్రి పూట ట్రాన్స్‌ఫార్మర్లకు తోటల్లోకి కాపలాగా వెళ్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్ ఉంటేనే కదా, మోటార్లు పని చేసి, తోటకు నీరు సరఫరా అయ్యేది. అదే ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేస్తే, మరలా కొత్తది తెచ్చి పెట్టుకోవాలంటే చాలా కష్టం అవుతోంది. అందుకనే ముందుజాగ్రత్తగా కాపలా వెళ్తున్నాం. పోలీసులు చర్యలు తీసుకుని చోరీలను అరికట్టాలి.

-రామాంజి, రైతు, మేళ్లకుంట

ప్రత్యేక నిఘా వేశాం

ఈ ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం విషయం మా దృష్టికి వచ్చింది. ఈ చోరీలను అరికట్టడానికి ప్రత్యేక నిఘా వేశాం. దాంతో పాటు ప్రత్యేక పోలీస్ సిబ్బంది కూడా నియమించి వీటిని అరికట్టడానికి ప్రయత్నిస్తున్నాం.

- రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

ఆర్థికంగా నష్టపోతాం



వేలాది రూపాయలు ఖర్చు చేసి, నానా అగచాట్లు పడి పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకుంటున్నాం. దొంగలు మాత్రం ఉద్దర సొమ్ముకు కక్కుర్తిపడి వాటిని ధ్వంసం చేస్తున్నారు. దీంతో ఆర్థికంగా బాగా నష్టపోతున్నాం. ఈ నష్టాన్ని భరించలేక ప్రతిరోజు రాత్రి పూట తోటల్లోకి కాపలాగా వెళ్తున్నాం. అరకొరగా పండుతున్న పంటలతో ఇబ్బందులు పడుతున్న మాలాంటి రైతులకు ఈ దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేస్తూ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. -రవి, రైతు, ఒంటారెడ్డిపల్లి

ప్రధాని రాష్ట్ర పర్యటనను నిరసిద్దాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనకు వ్యతిరేకంగా ఈనెల 7న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో శనివారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విభజన చట్టంలో భాగంగా కడపలో ఉక్కు పరిశ్రమ ను స్థాపించాల్సి ఉండగా, ఇపుడు కడప ఉక్కు మా పరిశీలనలో లేదని చేతులెత్తే యడం దారుణమన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వకుండా మోసం చేసిన బీజేపీ ప్రస్తుతం తాను ప్రభుత్వం ఏర్పాటు చేసింది ఆంధ్రా ఎంపీల మద్దతుతోనే అన్న విషయం మరువరాదన్నారు. తెలుగుదేశం, జనసేన మద్దతుతో మూడోసారి కేంద్రంలో అధికారంలో ఉండికూడా రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేయగలుగుతోందంటే అందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలే కారణమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు సుమారు రెండేళ్లుగా ప్రజలు పోరాడుతున్న విశాఖపట్నానికి ప్రధాని రావడం ఆంధ్రులను అగౌరపరచడమేనన్నారు. రాష్ట్రంలోని ఓడరేవులు, రోడ్లు, రైల్వేలైన్లను ప్రభుత్వం అదానీ కంపెనీకి అప్పగిస్తోందని ఆరోపించారు. అందుకే ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటనను నిరసిస్తూ జిల్లాకేంద్రంలో ఈనెల 7న నిరసనలు చేపడతామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బాలరంగయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, సావిత్రి, శ్రీనివాసులు, రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తిరాజు, జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, రామాంజినేయులు, తరిమెల రాజు, వెంకటనారాయణ, నిర్మల, అచ్యుత ప్రసాద్, మల్లికార్జున, మారుతీప్రసాద్, ముత్తుజా, ఓతూరు పరమేష్, కసాపురం రమేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాంభూపాల్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కుంచె...

షాజహాన్ (జయంతి)



మొఘల్ చక్రవర్తి షాజహాన్ 1592 జనవరి 5న జన్మించారు. 1628 నుంచి 1658 వరకు పాలించారు. పలు చారిత్రక కట్టడాలు నిర్మించారు. భార్య ముంతాజ్ బేగం జ్ఞాపకార్థం ఆగ్రాలో 'తాజ్ మహల్' నిర్మించారు. ఇది ప్రపంచంలోనే ప్రేమకు ప్రతిరూపంగా నిలిచింది. కోహినూర్ వజ్రంతోపాటు లెక్కకుమిక్కిలి సంపద కలిగిన రాజుగా పేరొందారు. సాహిత్యానికి ప్రాధాన్యం ఇచ్చారు. 1666 జనవరి 31న కన్నుమూశారు.

పరమహంస యోగానంద (జయంతి)



పరమహంస యోగానంద 1893 జనవరి 5న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్‌లో జన్మించారు. బెంగాల్‌కు చెందిన యోగి. అసలుపేరు ముకుంద లాల్ ఘోష్. 1916లో సన్యాస ఆశ్రమ ధర్మాన్ని స్వీకరించి యోగానందగిరి అయ్యారు. సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ (ఎస్ఆర్ఎఫ్), భారత యోగదా సత్సంగ సొసైటీ (వైఎస్ఎస్)ల ద్వారా ధ్యానం, క్రియా యోగాల గురించి నేటికీ సేవలు కొనసాగుతున్నాయి. 1946లో ఆయన రాసిన 'ఒక యోగి ఆత్మకథ' పుస్తకం విమర్శకుల ప్రశంసలను అందుకుని ఇప్పటివరకు 40లక్షల కాపీలకుపైగా అమ్ముడైంది. 1952 మార్చి 7న నిర్యాణం చెందారు.

పటౌడీ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత నవాబ్ మొహమ్మద్ మన్సూర్ అలీఖాన్ సిద్దిఖి పటౌడీ 1941 జనవరి 5న జన్మించారు. టైగర్ పటౌడీగా పేరొందారు. భోపాల్‌ను పాలించిన చివరి నవాబ్ మనవడు. క్రికెటర్‌గా రాణించారు. 21వ ఏటనే భారతజట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి ఆల్‌రౌండర్‌గా రాణించారు. 'ఇండియాస్ గ్రేటెస్ట్ కెప్టెన్‌గా, బెస్ట్ ఫీల్డర్ ఇన్ ది వరల్డ్'గా పేరొందారు. నటి షర్మిలా ఠాగూర్‌తో వివాహం జరిగింది. కుమారులు సైఫ్ అలీఖాన్, సోహా అలీఖాన్‌లు నటులుగా రాణిస్తున్నారు. ఆయన 2011 సెప్టెంబరు 22న కన్నుమూశారు.

మురళి మనోహర్ జోషి (పుట్టినరోజు)



'పద్మవిభూషణ్' పురస్కార గ్రహీత మురళి మనోహర్‌జోషి 1934 జనవరి 5న ఉత్తరాఖండ్‌లో జన్మించారు. బీజేపీ అగ్రనేతలలో ఒకరు. 1991 నుంచి 93వరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా వ్యవహరించారు. కాన్పూర్ నుంచి ఎంపీగా కొనసాగారు. ఎన్డీయే హయాంలో కేంద్ర మంత్రిగా కొనసాగారు. అంతకుముందు ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా అలహాబాద్ యూనివర్శిటీలో పనిచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబా పులె, దీన్‌దయాల్ ఉపాధ్యాయ వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతున్నారు.

మమతా బెనర్జీ (పుట్టినరోజు)



మమతా బెనర్జీ 1955 జనవరి 5న కోల్కత్తాలో జన్మించారు. దేశంలో పేరొందిన రాజకీయ మహిళానేత. పశ్చిమబెంగాల్‌కు 9వ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వేరై ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్ పార్టీని స్థాపించి చైర్‌పర్సన్‌గా ఉన్నారు. అభిమానులచే 'దీదీ'గా పిలవబడుతున్నారు. ప్రధాని పీవీ నరసింహారావు కేబినెట్‌లో కేంద్రమంత్రిగా వ్యవహరించారు. రచయిత, చిత్రకారిణి కూడా. 2012లో ప్రపంచంలో ప్రభావశీలురైన 100 మందిలో ఒకరిగా నిలిచారు. కోల్కత్తా యూనివర్సిటీనుంచి, కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

బ్రాడ్‌లీ కూపర్ (పుట్టినరోజు)



బ్రాడ్‌లీ కూపర్ 1975 జనవరి 5న పెన్సిల్వేనియాలో జన్మించారు. అమెరికాకు చెందిన నటుడు, దర్శకుడు. ప్రపంచంలో అత్యధిక రెమ్యూనరేషన్ అందుకున్న నటుడిగా నాలుగు సార్లు నిలిచారు. ఫోర్బ్స్ సెలెబ్రిటీ 100 జాబితాలో మూడుసార్లు నిలిచారు. 2015లో టైమ్స్ అత్యంత ప్రభావశీలురైన వందమందిలో ఒకరు. 2 గ్రామీ అవార్డులు, ఒక బాఫ్టా అవార్డు పొందారు. పలు అవార్డులకు ఎంపికయ్యారు. కాగా కేన్సర్ బాధితులకు పలు చారిటీ కార్యక్రమాలతో ఆదుకుంటున్నారు.

దీపికా పదుకొనె (పుట్టినరోజు)



దీపికా పదుకొనె 1986 జనవరి 5న జన్మించారు. ఆమె తల్లిదండ్రులు కర్ణాటక రాష్ట్రం ఉడుపి జిల్లా కుందాపుర తాలూకాకు చెందినవారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు ప్రకాశ్ పదుకొనె కుమార్తె. ఆమె కూడా జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ఆడారు. అయితే ఫ్యాషన్, మోడల్ కోసం క్రీడలను వదిలేశారు. తర్వాత వెండితెరపై రాణించారు. ఐశ్వర్య్ అనే కన్నడ సినిమాతో తెరంగేట్రం చేశారు. అత్యధిక రెమ్యూనరేషన్ పొందేస్థాయికి చేరారు. 3 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు పొందారు. నటుడు రణవీర్‌సింగ్‌ను పెళ్ళి చేసుకున్నారు.

ఆలయాల్లో చోరీ

శింగనమల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గాంజనేయస్వామి కొండ మీద ఉన్న ఆలయాల్లో శుక్రవారం గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఐదు కిలోల వెండి, అమ్మవారి పంచలోహ విగ్రహం చోరీ అయ్యాయి. కొండమీద దుర్గాంజనేయస్వామి, సిరి దుర్గమ్మ దేవాలయాలు ఉన్నాయి. అర్ధరాత్రి సమయంలో ఆలయాలు తాళాలు ధ్వంసం చేశారు. అనంతరం ఆలయాల్లోకి చొరబడి దుర్గాంజనేయస్వామి విగ్రహం మీద ఉన్న వెండి కౌశం, కిరీటం, సిరి దుర్గమ్మ అమ్మవారి విగ్రహం మీద ఉన్న వెండి, బంగారం గిన్నె బొట్టుతోపాటు అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. అర్చకులు ఫిర్యాదు మేరకు సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయకుమార్ సిబ్బందితో సంఘటన్నా స్థలాన్ని పరిశీలించారు.



వేదికపై బీజేపీ నాయకులు

ప్రియాంక ఖర్గే రాజీనామా చేయాలి: బీజేపీ

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బీదర్‌కు చెందిన కాంట్రాక్టర్ సచిన్ పాంచాళ్ ఆత్మహత్యకు బాధ్యత వహిస్తూ మంత్రి ప్రియాంకఖర్గే రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర,ప్రతిపక్షనేతలు అశోక్, ఛలవాది నారాయణస్వామితో పాటు పెద్దఎత్తున పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. కలబురగిలోని జగత్ సర్కిల్ నుంచి జిల్లాధికారి కార్యాలయం మీదుగా ప్రియాంకఖర్గే నివాసందాకా నిరసన ర్యాలీ చేపట్టాలని నిర్ణయించారు. బీజేపీ ముందుగానే పిలుపు మేరకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 1000 మందికి పైగా పోలీసులు, కేఎస్ఆర్‌పీ, సీఏఆర్ సాయుధబలగాలను భద్రతకు కేటాయించారు. నిరసనకారులను పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. మంత్రి ఇంటి వైపు దూసుకెళ్ళేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని నాయకులందరినీ అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అంతకు ముందు నిర్వహించిన సభలో ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ సచిన్ ఆత్మహత్యకు ప్రోత్సహించిన వారు ఎవరనేది తెలుస్తూనే ఉందన్నారు. మంత్రి అనుచరుడు రాజుకపనూరు ఓ గూండా అంటూ మండిపడ్డారు. మంత్రి పదవికి ప్రియాంకఖర్గే రాజీనామా వెంటనే చేయాలన్నారు. రాజీనామా చేసేవరకు పోరాటం ఆపమన్నారు. చలవాది నారాయణస్వామి మాట్లాడుతూ ఓ వ్యక్తి ప్రాణాలతో చెలగాటం ఆడటం సమంజసమేనా అని ప్రశ్నించారు. మేం ఏమైనా మీ ఇంట్లో ఆడబిడ్డను పెళ్ళి చేసుకునేందుకు అడిగామా అంటూ మంత్రిపై మండిపడ్డారు. నిరసనకు వచ్చేవారికి కొబ్బరిబోండాలు, జ్యూస్‌లు, టీ ఇస్తామంటూ మాట్లాడడం సరికాదన్నారు. బీజేపీ బాధితుల తరుపున పోరాటం చేస్తుంటే అధికారంలో ఉండే కాంగ్రెస్ పెద్దలు ఎవరి పక్షాన ఉన్నారంటూ ప్రశ్నించారు. నా రాజకీయ అనుభవమంత నీ వయస్సు లేదని మాట్లాడే ముందు తెలుసుకోవాలని చలవాది ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీలు సీటీ రవి, రాజీవ్, ఉమేష్‌జాధవ్, ఎన్.మహేష్, బసవరాజ్ ముత్తిమూడ్, డాక్టర్ శైలేంద్ర బెల్దాళె, శరణుసలగరతో పాటు కలబురగి,బీదర్ ప్రాంతాలకు చెందిన పార్టీ కార్యకర్తలు భారీగా హాజరయ్యారు.



ప్రతిపక్ష నేత అశోక్‌ను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు



భారీగా తరలివచ్చిన బీజేపీ కార్యకర్తలు

ఒక్క చాన్స్ ప్లీజ్..!

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విధానపరిషత్‌కు నామినేటెడ్ విధానంతో నలుగురిని ఎంపిక చేసేందుకు వీలున్నందున ఆశావాహులు తీవ్రస్థాయిలో లాబీ చేస్తున్నారు. సభ్యులు యూబీ వెంకటేష్, ప్రకాష్ రాథోడ్‌ల పదవీకాలం ముగిసింది. చెన్నపట్టణ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన సీపీ యోగేశ్వర్ బీజేపీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కాగా ఈనెల 27న జేడీఎస్ సభ్యుడు తిప్పేస్వామి పరిషత్ పదవీకాలం ముగియనుంది. ఇలా నాలుగు స్థానాలకు ఖాళీ ఏర్పడగా, కాంగ్రెస్ నుంచి ఎంపిక చేసే వెసలుబాటు ఉంది. అయితే ఆ స్థానాలకు ఏకంగా 20 మంది దాకా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. యూబీ వెంకటేష్, ప్రకాష్‌రాథోడ్ మరోసారి అవకాశం కోసం ప్రయత్నిస్తున్నారు. మాజీ సభాపతి బీఎల్ శంకర్, మాజీ మంత్రి రాణి సతీష్‌లు ఇప్పటికే సీఎంను కలిసి అవకాశం కోరినట్లు తెలుస్తోంది. నలుగురిని భర్తీ చేయాల్సి ఉన్నందున డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయంతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను సంప్రదించాల్సి ఉంటుంది. ఇప్పటికే పలువురు ఇటు సీఎం, డీసీఎంలతోనే కాకుండా ఢిల్లీలో ఖర్గేతో పాటు ఇతర నేతల ద్వారా కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నెలాఖరులోగానే నలుగురిని ఎంపిక చేయడం ద్వారా పరిషత్‌లో ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల నాటికి బలం పెంచుకోదలచారు. నలుగురిని ఎంపిక చేయాలంటే సీఎం, డీసీఎంలు ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత అధిష్టానం ఆమోదం కూడా లభించాల్సి ఉంటుంది.

పిగ్మీ ఏజెంట్ హత్య

- నగదు, నగలు దోచుకుని మాంసాహార విందు
- నిందితుడిని అరెస్ట్ చేసిన ఉత్తర కన్నడ పోలీసులు



శాంత (ఫైల్) | అజిత్

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ జిల్లా సిద్దాపుర ఒంటరిగా నివసిస్తూ పిగ్మీఏజెంట్‌గా పని చేసే మహిళలను హతమార్చి గ్రామంలో మాంసాహార విందు ఏర్పాటు చేసిన నిందితుడి ఉదంతం వెలుగులోకి వచ్చింది. సిద్దాపుర పట్టణం సొరబ రోడ్డులోని బసవన వీధిలో నివసించే శాంత కొన్నేళ్ళుగా వినాయక సౌహార్ధ క్రెడిట్ సొసైటీ పిగ్మీ ఏజెంట్‌గా పని చేసేవారు. డిసెంబరు 23న రాత్రి ఆమె హత్యకు గురయ్యారు. పోలీసులు వివిధ కోణాల్లో పరిశీలించినా ఆచూకీ లభించలేదు. దీంతో గడిచిన పదేళ్లలో ఈప్రాంతంలో దొంగతనాలకు పాల్పడిన వారిని అనుమానంతో స్టేషన్‌కు తీసుకువచ్చి దర్యాప్తు చేపట్టారు. ఎటువంటి క్లూ లేకపోవడంతో హత్యకేసు ఛేదించలేక పోయారు. పోయారు. గ్రామంలో ఎటువంటి ఆదాయం లేకున్నా ఇటీవల స్థానికులందరికీ మాంసాహార విందు ఏర్పాటు చేసిన విషయంపై బీట్ కానిస్టేబుళ్లు అభిజిత్‌ను విచారణ జరిపారు. విందుకు తగిన నగదు ఏవిధంగా సమకూర్చావని నిలదీయడంతో పిగ్మీ ఏజెంట్ శాంత హత్య చేసినట్లు అంగీకరించినట్లు శుక్రవారం జిల్లాఎస్పీ నారాయణ తెలిపారు. డిసెంబరు 23న శాంత ఇంటికి వచ్చేందుకు ముందుగానే పైకప్పుకు ఉండే పెంకులను తొలగించి ఇంట్లోకి ప్రవేశించారు. ఆమె ఇంట్లోకి రాగానే గొంతునులిమి హత్య చేశారు. ఆతర్వాత ఆమె వద్ద ఉండే నగదుతో పాటు బంగారం ఆభరణాలు దోచుకుని పరారీ అయ్యారు. రూ.19,280 నగదుతో పాటు చెవి కమ్మలను ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి రూ.28,000 అప్పు తీసుకున్నారన్నారు. గాజులతోపాటు ఇతరత్రా వస్తువులను ఇంట్లోనే దాచుకున్నారని వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

టెకీ అతుల్ ఆత్మహత్య కేసులో ముగ్గురికి బెయిల్

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): టెకీ అతుల్ సుభాష్ ఆత్మహత్య కేసులో భార్యతోపాటు ముగ్గురికి బెయిల్ మంజూరయ్యింది. బెయిల్ విచారణలు జరిపిన 29వ ఎసీఎంఎం కోర్టు శనివారం బెయిల్ మంజూరు చేసింది. అతుల్ భార్య నిఖితా సింఘానియాతో పాటు ఆమె తల్లి, సోదరుడులు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసుకున్నారు. బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ధర్మాసనం సూచించింది. దీంతో ఎసీఎంఎం కోర్టు విచారణలు జరిపి బెయిల్ మంజూరు చేసింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అతుల్ సుభాష్ డిసెంబరు 9న మారుతహళ్ళి మంజునాథ్ లేఅవుట్‌లోని అపార్ట్‌మెంట్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్యవేధింపులు భరించలేక బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు సుదీర్ఘంగా డెత్‌నోట్‌లో రాసుకున్న విషయం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది.

డీఎస్పీకి జ్యుడీషియల్ కస్టడీ

బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): భూవివాదంపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధిత మహిళతో ఏకంగా కార్యాలయంలోనే రాసలీలకు పాల్పడిన డీఎస్పీ రామచంద్రప్పకు 14రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ కోర్టు ఆదేశించింది. డీఎస్పీ రామచంద్రప్ప రాసలీల వీడియోలు గురువారం రాత్రి వైరల్‌కాగా హోంమంత్రితో పాటు జిల్లా ఎస్పీ సీరియస్‌గా భావించారు. శుక్రవారం రాత్రిదాకా అజ్ఞాతంలో ఉన్న డీఎస్పీని అరెస్టు చేసిన పోలీసులు శనివారం వైద్య పరీక్షలు జరిపి మధుగిరి జేఎంఎఫ్‌సీ కోర్టు ముందు హాజరుపరిచారు. సోమవారం దాకా మధుగిరి జైలులో ఉంచి ఆతర్వాత తుమకూరు జైలుకు పంపాలని ఆదేశించింది.

నవభారత నిర్మాణానికి విద్యార్థులు కట్టుబడాలి

- యూజీసీ చైర్మన్ జగదీశ్‌కుమార్

బెంగళూరు, జనవరి4(ఆంధ్రజ్యోతి): సుస్థిరమైన ఆరోగ్యం, సురక్షణ, శాంతితోకూడిన నవభారత నిర్మాణం సాధ్యమయ్యేందుకు యువ విద్యార్థులు కట్టుబడాలని యూజీసీ చైర్మన్ జగదీశ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. రామయ్య అప్లైడ్ సైన్స్ యూనివర్సిటీ 9వ స్నాతకోత్సవం శుక్రవారం జరిగింది. విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేసిన అనంతరం జగదీశ్‌కుమార్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేయడం ద్వారా భవిష్యత్తులో ఏ విధంగా స్థిరపడాలని ఒక నిర్ణయానికి వచ్చి ఉంటారన్నారు. ప్రతి విద్యార్థి ఇక్కడనుంచే తమ భవిష్యత్తును మలచుకునేందుకు కీలకంగా భావించాలన్నారు. ఉద్యోగమే కాదు పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌లవైపు దృష్టి సారించాలన్నారు. యువత నవభారత్‌గా మార్చాలన్నారు. అత్యధికంగా ప్రణాళికలకంటే ప్రతిరోజూ కొత్తదనం, కొత్త అంశాన్ని నేర్చుకోవాలనే విధానం యువత పాటించాలన్నారు. వృత్తితోపాటు ఆరోగ్యం పట్ల ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కేంద్రప్రభుత్వం ఎన్నో పథకాలను విద్యార్థులకోసమే రూపొందించిందన్నారు. రానున్న ఐదేళ్లలో కోటిమందికి పరిశ్రమలకు అవసరమైన నైతిక శిక్షణలు ఇస్తారన్నారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఆర్ జయరాం మాట్లాడుతూ జ్ఞానశక్తికి ఉండే మహత్తరం మరే విభాగానికి ఉండదన్నారు. గుణాత్మకమైన విద్య అందించాలని సమాజానికి అవసరమైన ఉన్నత విద్యకోసం రామయ్య ఆశయంతో సంస్థను ప్రారంభించారన్నారు. విద్యార్థులు నైపుణ్యత, నేర్చుకోవడం, ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్నాతకోత్సవంలో 1910 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. వీరిలో న్యాయ, వైద్య, మేనేజిమెంట్ కోర్సులలో పట్టాలు ప్రదానం చేశారు. వీరిలో 32మందికి పీహెచ్‌డీలు, 670మందికి పీజీ, 1208మందికి డిగ్రీలు ప్రదానం చేశారు. 102మందికి బంగారు, వెండి పతకాలు బహూకరించారు.



పట్టాలు పొందిన విద్యార్థులతో యూజీసీ చైర్మన్ జగదీశ్‌కుమార్ తదితరులు





సందేహం..!

- అపోహలతో అవయవదానానికి వెనకడుగు
- మెడికోల పరిశోధనలకు మృతదేహాల కొరత
- అనాథ శవాలకు అడ్డొస్తున్న నిబంధనలు
- వైద్య బోధనలకు కృత్రిమ అవయవాలు



బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పలు అపోహలతో, మూఢ నమ్మకాలతో అవయవదానానికి వెనకడుగు వేస్తున్నారు. వైద్యవిద్యార్థుల సమగ్ర అధ్యయనం కోసం మృతదేహాలతో పరిశోధనలు చేయడం పరిపాటి. అయితే మనిషి అవయవాల పనితీరు గురించి ప్రయోగాత్మకంగా నైపుణ్యం కోసం మెడికల్ కళాశాలలకు మృతదేహాల కొరత వెంటాడుతోంది. దీంతో రాష్ట్రంలోని వైద్యవిద్యార్థులు తొలి ఏడాదిలో అధ్యయనం, విజ్ఞాన ప్రగతి, పరిశోధనలకు ఆటంకం ఏర్పడింది.

ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్ వైద్యవిద్యార్థులకు మానవ శరీరం ఎలా ఉంటుందనేది తొలి ఏడాది అధ్యయనం ద్వారా అవగాహన కల్పిస్తారు. ప్రయోగాత్మకంగా నేర్చుకున్న తర్వాతనే తదుపరి తరగతులకు వెళ్లాల్సి ఉంటుంది. దశాబ్దాలకాలంగా ప్రతి మెడికల్ కళాశాలలో విద్యార్థులకు ఇదే తరహా బోధనలు కొనసాగుతున్నాయి. అనాటమీ విభాగంలో సమగ్ర అవగాహనను అధ్యాపకులు కల్పిస్తారు. మానవుడి శరీరంలో అవయవాల నిర్మాణం, పనితీరును వివరిస్తారు. శస్త్రచికిత్సా విధానాలపై విద్యార్థులకు నైపుణ్యత కల్పిస్తారు. ఇందుకోసం ప్రతి పదిమంది విద్యార్థులకు ఒక మృతదేహం అవసరమని నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలు ఉన్నాయి. ఇలా మెడికల్ కళాశాలలో చదివే విద్యార్థులు ప్రతి 10మందికి ఒక మృతదేహాన్ని కేటాయించి వారికి బోధనలు అందించాల్సి ఉంటుంది. కానీ అందుబాటులో దేహాలు లేకపోవడంతో విద్యార్థులు అవగాహన పొందేందుకు ఇబ్బందిగా మారింది.

వైద్య విద్యార్థులకు త్రీడీ పాఠాలు

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, డీమ్డ్ యూనివర్సిటీలతో కలిపి 71 మెడికల్ కళాశాలలు ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరంలో 20,990మంది విద్యార్థులు ఎంబీబీఎస్ కోర్సుల్లో చేరారు. వారికి ప్రయోగాత్మకంగా నైపుణ్యం కోసం 2099 మృతదేహాలు అవసరంగా ఉంటాయి. అన్ని దేహాలు లభించని కారణంగా కొన్ని కళాశాలలో త్రీడీ టెక్నాలజీ ఆధారంతో వర్చువల్ డిసెక్షన్ టేబుల్ (వీడీటీ) అమర్చి పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. రాష్ట్రంలో 22 మెడికల్ కళాశాలలు 3,500మంది విద్యార్థులు ఎంబీబీఎస్‌లో చేరగా వీరికి 350 మృతదేహాలు అవసరం కానున్నాయి. ప్రస్తుతం 93 మృతదేహాల కొరత ఉంది. 10 ప్రభుత్వ కళాశాలల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. కొన్ని చోట్ల 150మంది విద్యార్థులకు 2-3 మృతదేహాలు మాత్రమే ఉండగా వాటి ద్వారానే బోధనలు కొనసాగిస్తున్నారు. ప్రైవేట్ కళాశాలలు ఆయుర్వేద, హోమియోపతి కళాశాలల్లో సమస్య ఉంది.

దేహదానానికి ఎన్నెన్నో అడ్డంకులు

రాష్ట్రంలో ఏడాదికాలంగా అవయవదానంపై ప్రజల్లో చైతన్యం వస్తోంది. ఇప్పటివరకు 27,243 మంది ఆర్గాన్‌డోనార్‌గా నమోదు చేసుకున్నారు. కానీ దేహదానానికి ముందుకొచ్చేవారు అంతంతమాత్రమే అనిపిస్తోంది. కొన్ని చోట్ల దేహదానానికి నమోదు చేసుకున్నా మృతి చెందిన తర్వాత వారి బంధువులు మృతదేహాన్ని అప్పగించేందుకు అంగీకరించడం లేదు. ఇందుకు సంప్రదాయాలు కారణంగా చూపుతున్నారు. మృతదేహాల అంత్యసంస్కారాలు జరపకుంటే వారి ఆత్మ శాంతించదనే మూఢ విశ్వాసంతోనే వెనుకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందిన సందర్భంలో వాటిని మెడికల్ కళాశాలలకు అప్పగించేందుకు సాంకేతికమైన సమస్యలు అడ్డు అవుతున్నాయి.

వర్చువల్ ల్యాబ్‌లపై విద్యార్థుల అనాసక్తి

మృతదేహాల కొరతతో సిమ్యులేట్ వర్చువల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకోవాలని నేషనల్ మెడికల్ కమిషన్ సూచనల మేరకు మండ్య మెడికల్ కళాశాల వర్చువల్ డిసెక్షన్ టేబుల్ (వీడీటీ) ఏర్పాటు చేసింది. మృతదేహాలపై అధ్యయనం కల్పిస్తున్నారు. కొన్నిచోట్ల మనిషి శరీర ఆకృతి మోడళ్లను సిద్ధం చేస్తున్నారు. అయితే మృతదేహాలకు శస్త్రచికిత్సలు జరిపి అవగాహన పొందేలాంటి వెసలుబాటు, నైపుణ్యత సాధ్యం కాదని అభిప్రాయపడుతున్నారు. ప్రయోగాత్మక అధ్యయనాలకు, డిజిటల్ బోధనలకు భారీ వ్యత్యాసం ఉంటోంది. దీంతో కొందరు విద్యార్థులు వర్చువల్ ల్యాబ్‌ల పట్ల ఆసక్తి చూపడం లేదు. దీంతో ఇతర మెడికల్ కళాశాలలో అదనంగా ఉండే మృతదేహాలను సమకూర్చేందుకు విన్నవిస్తున్నారు.


దేహాల కొరత ఉండే కళాశాలలు ఇవే...

రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో దేహాల కొరత ఉండే వాటిలో కొడగు 15, బళ్ళారి 14, గదగ్ 10, బీదర్ 9, చిక్కబళ్లాపుర 9, హావేరి 9, యాదగిరి 7, చిత్రదుర్గ 7, హాసన్ 7, కొప్పళలో 6 మృతదేహాల కొరత ఉంది. కాగా బెంగళూరు, హుబ్బళ్ళి, మైసూరు, బెళగావి, శివమొగ్గ, రాయచూరులలో ఎక్కువ మృతదేహాలు ఉన్నాయి. కొవిడ్ తర్వాత సమస్య తీవ్రమైనట్లు వైద్యవిద్యాధికారి ద్వారా సమాచారం. గతంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అధ్యయనం కోసం మృతదేహాలు లభించేవి. అప్పట్లో మెడికల్ కళాశాలలతోపాటు విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండేది. ఒక మృతదేహం ద్వారా 25మంది విద్యార్థులకు ప్రయోగాత్మక శిక్షణలు కల్పించేవారు. ప్రస్తుతం నిబంధనలు మారడం, ఎంబీబీఎస్ విద్యార్థుల సంఖ్య పెరగడంతో సమస్య ఏర్పడింది. ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జేడీఎస్ నిర్వీర్యానికే..

ఆపరేషన్ హస్త కుట్ర

- ప్రలోభ పెట్టినట్లు ఎమ్మెల్యేలు స్వయంగా చెప్పారు..
- 12 మందిని పార్టీ మార్చే ప్రయత్నాలు జరిగాయి
- కేంద్రమంత్రి కుమారస్వామి సంచలన ఆరోపణ



బెంగళూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకే ఆపరేషన్ హస్త కుట్ర పన్నారని కేంద్ర మంత్రి కుమారస్వామి సంచలనమైన ఆరోపణలు చేశారు. బెంగళూరులో కుమారస్వామి మీడియాతో మాట్లాడుతూ జేడీఎస్ పార్టీకి చెందిన 12-13 మంది ఎమ్మెల్యేలను పార్టీ మార్పించే ప్రయత్నాలు జరిగాయన్నారు. అయితే జేడీఎస్ ఎమ్మెల్యేలను మార్పు చేయడం అంత సులువు కాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాపాలు పెరిగాయన్నారు. తమ ఎమ్మెల్యేలు తనకు పూర్తి సమాచారం అందించారన్నారు. సంక్రాంతి ముగిసే దాకా ఏమీ మాట్లాడేది లేదన్నారు. జేడీఎస్ ఇటువంటి కుట్రలకు భయపడేది లేదని, జేడీఎస్‌ను ఎప్పటికీ నిర్వీర్యం చేయలేరన్నారు. దేవుడే కాంగ్రెస్‌కు తగిన శిక్ష వేస్తారన్నారు. దేశంలో గ్యారెంటీలకు పోటీ పడుతున్నారన్నారు. తొలుత అమలు చేసిన హిమాచల్ ప్రదేశ్ పరిస్థితి ఏం జరిగిందో తెలిసిందేనన్నారు. రాష్ట్రంలో ఎటువంటి పరిస్థితి ఉందో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గ్రాంట్ల కోసం ఎన్ని తంటాలు పడుతున్నారో అందరికీ తెలుసన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఆత్మాభిమానం ఉంటే ప్రభుత్వం ఏదిశగా వెళుతుందో దృష్టి సారించాలన్నారు. మైసూరులో ప్రిన్సెస్(మహారాణి) పేరుతో ఉండే రోడ్డుకు సిద్దరామయ్య పేరు పెట్టాలనే ప్రస్తావనపై ఆయన ఎద్దేవా చేశారు. కర్ణాటకకే సిద్దరామయ్య పేరు పెడితే బాగుంటుందన్నారు. మరో ప్రశ్నకు సమాధానంగా తమ పార్టీ సీనియర్ నేత జీటీ దేవెగౌడతో తనతో భార్యాభర్తల సంబంధమన్నారు. ఎన్నోసార్లు గొడవలు జరుగుతాయని ఆతర్వాత సమిసిపోతాయన్నారు.


నిరసన ర్యాలీలో బీజేపీ నేతలు

ప్రియాంక ఖర్గే రాజీనామా చేయాలి

- బీజేపీ డిమాండ్.. మంత్రి ఇంటి ముట్టడికి యత్నం
- కాంట్రాక్టర్ ఆత్మహత్యపై మండిపాటు
- ఆందోళనకు వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు
- అడ్డుకున్న పోలీసులు... అడుగడుగునా బందోబస్తు
- నాయకుల అరెస్టు.. బస్సుల్లో తరలింపు

7


భారీగా తరలివచ్చిన కార్యకర్తలు

నేడు ముత్యాల ముగ్గుల పోటీలు

బళ్లారి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యానగరలో ఉన్న శ్రీ నంద రెసిడెన్సియల్ స్కూల్‌లో ఆదివారం ముత్యాల ముగ్గుల పోటీలు జరగనున్నాయి. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్)లో పాల్గొనేందుకు మహిళలు సిద్ధమయ్యారు. శ్రీ నంద రెసిడెన్షియల్ స్కూల్‌లో జరగనున్న ఈ పోటీలకు ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ శోభారాణి హజరుకానున్నారు. పాఠశాలలో ముగ్గుల పోటీలుకు సర్వం సిద్ధం చేశారు. ముగ్గులు వేసేందుకు వీలుగా మైదానం సిద్ధమయ్యింది. ఇందులో విజేతలకు తొలిబహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ. 4 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు శ్రీ నంద రెసిడెన్షియల్ స్కూల్ యాజమాన్యం అందజేయనున్నారు. పోటీలకు విశేష స్పందన లభించింది. ఇప్పటికే పలువురు మహిళలు పేర్లు నమోదు చేసుకున్నారు. పేర్లు నమోదు చేసుకోని వారు నేరుగా వచ్చి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించారు.

హోసూరులో..

హోసూరు (ఆంధ్రజ్యోతి): హోసూరులో ముత్యాల ముగ్గు పోటీలకు సర్వం సిద్ధమయ్యింది. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)లో పాల్గొనేందుకు మహిళలు సిద్ధమయ్యారు. హోసూరు నగరంలోని హిమగిరి గ్రూప్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నారు. మొదటి బహుమతి రూ.6.000, రెండవ బహుమతి రూ.4.000,మూడవ బహుమతి రూ.3.000 అందజేయనున్నారు. హోసూరులోని హిమగిరి నగరం ఆర్టీఓ కార్యాలయం ఎదుట బాగలూరు రోడ్డు, ఎలువలపల్లి వద్ద పోటీలు జరపనున్నారు. ఉదయం 9 గంటలకు జీఆర్‌టీ నుంచి ఉచిత వాహన సదుపాయం కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి పి.బాలకృష్ణారెడ్డి హాజరై బహుమతులు అందజేయనున్నారు. ఇప్పటికే పలువురు మహిళలు పోటీలకు పేర్లు నమోదు చేసుకున్నారు.



ఒక్క చాన్స్ ప్లీజ్..!

- నామినేటెడ్ ఎమ్మెల్సీల కోసం జోరుగా ప్రయత్నాలు
- సీఎం, డీసీఎంల ద్వారా లాబీయింగ్..

- వివరాలు..7లో